నేటి నుంచి సబ్ జూనియర్ రోయింగ్ చాంపియన్ షిప్

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్ సాగర్‌లో 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అండర్-13, 15లో బాలురు, బాలికల విభాగాల్లో 23 రాష్ట్రాల నుంచి దాదాపు 350 మంది పాల్గొంటారని తెలిపారు. 'తెలంగాణ జరూర్ ఆనా'అనే నినాదంతో క్రీడల టూరిజాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగానే ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మిథున్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రహానా బేగం

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని జీహెచ్‌ఎంసీ క్రీడా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రహానా బేగం అన్నారు. జీహెచ్‌ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ జిమ్నాస్టిక్స్, ఫిట్‌నెస్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిమ్నాస్టిక్ సీనియర్ కోచ్ జి.బాల్‌రాజ్, బ్రహ్మానంద ప్రసాద్, జిమ్ కోచ్ జి.మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి

గోల్కొండ: స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ 142వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నామని కార్వాన్ వీర్ సావర్కర్ అసోసియేషన్ ప్రతినిధి జొన్నకుంటి మధుసూదన్ అన్నారు. మంగళవారం ఆయన పలువురు బీజేపీ నాయకులను కలిసి జయంతి వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అబిడ్స్-14వ సర్కిల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. మంగళవారం నియోజకవర్గంలోని మంగళ్‌హాట్, ధూల్‌పేట్, అబిడ్స్, చిరాగ్‌గల్లీతో పాటు పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మంజుల సింగ్ ఆధ్వర్యంలో సెక్షన్ అధికారి నరేష్, ఇతర సిబ్బంది ఈ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోని బేగంబజార్, ఫీల్‌ఖానా, మహారాజ్ గంజ్ మిగతా ప్రాంతాల్లో కూడా వేగవంతంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు వెల్లడించారు.

యువకుడిపై హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్

గౌలిపురా: యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో భవానీనగర్ పోలీసులు మంగళవారం నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన సయ్యద్ సాబేర్ (30) 2014లో కరీం హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. కాగా 2019 ఈ కేసులో సయ్యద్ సాబేర్ నిర్దోషిగా బయటికి వచ్చాడు. దీంతో సయ్యద్ సాబేర్‌పై బండ్లగూడ గౌస్‌నగర్‌కు చెందిన మృతుడు కరీం సోదరుడు షేక్ చాంద్ పాషా అలియాస్ చాంద్ పగ పెంచుకున్నాడు. సయ్యద్ సాబేర్‌ను పలుమార్లు చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇందులో భాగంగా ఈ నెల 24న తలాబ్‌కట్టా సిద్ధిఖీనగర్‌లోని ఓమర్ పాన్‌షాపు వద్దకు ఆటోలో వచ్చిన షేక్ చాంద్ పాషా (27), తలాబ్‌కట్టాకు చెందిన ఇమ్రాన్ ఖాన్ (28), మహ్మద్ ఆదిల్ (21), సయ్యద్ సమీర్ అలియాస్ కిరాక్ సమీర్ (20)లు సాబేర్‌పై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై అంజుమ్ బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం హత్యాయత్నానికి పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఉద్యానవనం వద్ద ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

భయాందోళనలో స్థానికులు • పట్టించుకోని అధికారులు


రహీంపురా బన్నీలాల్ వ్యాస్ ఉద్యాన వనం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

జియాగూడ: రహీంపురాలోని బన్నీలాల్ వ్యాస్ ఉద్యానవనానికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకంగా ఉన్నాయి. దీంతో పార్క్‌కు వచ్చే వారు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు ఆడుకోవడానికి పార్క్‌లో ప్రత్యేక ఆట వస్తువులు ఉన్నప్పటికీ పార్క్ గేట్ వద్దనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో వచ్చే వారు జంకుతున్నారు. అసలే పార్క్‌లు కరువైన ఈ రోజుల్లో ఉన్న కొద్ది ఉద్యానవనాల వద్ద సమస్యలు నెలకొంటున్నాయి. 1965లో సీబీబీ క్వార్టర్స్ నిర్వాసితుల కోసం నిర్మించిన పార్క్ సందర్శకులు లేక వెలవెలపోతున్నాయి.

పార్క్ చుట్టూ చెత్తాచెదారం..

సుమారు రెండు ఎకరాలలో ఉన్న పార్క్ చుట్టూ చెత్తాచెదారం, మూత్ర విసర్జనలు, అక్రమంగా కార్లు ఇతర వాహనాల పార్కింగ్, పార్క్ చుట్టూ ఉంటాయి. ఇటీవల పార్క్ రహదారి ఆటస్థలం గుండా సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణం జరిగాయి. కానీ పైపులు మాత్రం పార్క్ గేటు వద్దే వదిలేశారు. రాత్రి అయితే చాలు నిర్మానుష్యంగా ఉండే పార్క్ పరిసరాలు తాగుబోతులకు అడ్డగా మారుతుంది. ఇక్కడే కూర్చొని మద్యం సేవించి బాటిల్స్‌ను పగులగొట్టి పార్క్‌లో వాడి పాడేస్తున్నారు.

నిలిచిపోయిన కార్యక్రమాలు..

పార్క్ చుట్టురా ఉన్న సమస్యల కారణంగా పార్క్‌లో వాకింగ్, యోగా, చిన్నారుల ఆటలు, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు పార్క్ చుట్టురా ఉన్న సమస్యలను పరిష్కరించి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి..


రహీంపురాలో ఉన్న పార్క్ పరిసరాల సమస్యలను పరిష్కరించి సౌకర్యాలతో అందుబాటులోకి తేవాలి. అలాగే మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ ఇక్కడ పికెట్ ఏర్పాటు చేసి గమనించాలి. అక్రమ పార్కింగ్ వాహనాలు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవాలి.

–మోహన్ గౌడ్, రహీంపురా

పార్క్‌కు జనాలు రావడం తగ్గారు..


రహీంపురా పార్క్ సుమారు 50 ఏళ్ల నుంచి ఉంది. గతంలో యోగా, వాకింగ్‌లు కొనసాగేవి. ప్రస్తుతం పార్క్ పరిసరాల అపరిశుభ్రత, భారీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పార్క్ రావడం జనాలు తగ్గారు. విశాలంగా ఉన్న పార్క్ స్థలంలో సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలు ప్రారంభించాలి.

– గోపిశెట్టి ప్రమోద్ కుమార్, ధూలపేట మున్నూరు కాపు సంఘం కార్యదర్శి

విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం


డీఈ మహ్మద్ ఫర్హత్‌అలీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా వేగవంతంగా పరిష్కరిస్తామని టీఎస్ఎస్‌పీడీసీఎల్ బేగంబజార్ డివిజన్ డివిజనల్ ఇంజినీర్ మహ్మద్ ఫర్హత్‌అలీ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని సెక్షన్ల కార్యాలయాల పరిధులలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత ఏడీఈలు ఏఈలచే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆయనకు వినతిపత్రం అందజేసి పలు విద్యుత్ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా డీఈ మహ్మద్ ఫర్హత్ అలీ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..వర్షాకాలం ప్రారంభం కావడంతో అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, అహ్మద్, దుర్గారాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం గర్వపడేలా కోట బోనాలు



బోనాల నిర్వహణ కమిటీ ప్రతినిధులతో ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను రాష్ట్రం గర్వించేలా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టోలిచౌకి ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. మంగళవారం పీస్ కమిటీ సభ్యులు, గోల్కొండ కోట బోనాల ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్, సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం కోట బోనాలకు ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు. బోనాల ఉత్సవాలు జరిగే రోజుల్లో కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ వారు అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేందర్‌ప్రసాద్, బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ చంటిబాబు, ఎన్.శ్రీకాంత్, ఆబేద్, ఎలియాస్ అలీ, అనిత ఉన్నారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి


సదస్సులో పాల్గొన్న అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్ రావు

గన్‌ఫౌండ్రీ: ఆసియా–పసిఫిక్ గ్రామీణ, వ్యవసాయ క్రెడిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోనేషియాలో జరుగుతున్న 78వ కార్యనిర్వాహక కమిటీ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ బృందం హాజరైంది. వృత్తికార ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ ఆర్థిక సహాయం అనే అంశంపై జరుగుతున్న సదస్సుకు అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాల్లో వ్యవసాయం చేస్తున్న తీరు, అక్కడ అందుతున్న ఆర్థిక సహాయం, వ్యవసాయ అభివృద్ధి వంటి అంశాల గురించి క్షుణంగా తెలుసుకున్నామని ఆయా పద్ధతులను తెలంగాణలోనూ అవలంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ బ్యాంక్ డైరెక్టర్లు కొత్తకురుమ సత్తయ్య, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, కుంట రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి


అమ్మవారికి పూజలు చేస్తున్న చంటిబాబు తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు అన్నారు. మంగళవారం ఆయన కోటపై ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం తరపున అన్ని శాఖల అధికారులను కలిసి ఏర్పాట్లపై చర్చిస్తున్నామన్నారు. అదే విధంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత సూచనల మేరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి బి.సురేష్‌చారి, నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.శ్రీకాంత్, బి.అనిత తదితరులున్నారు.

ఘనంగా శనేశ్వర జయంతి


వేడుకల్లో అవదూతగిరి మహరాజ్, గోపాల్ సింగ్, బద్రినాథ్ తదితరులు

జియాగూడ: శనేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శని మహరాజ్‌కు అభిషేకాలు, నువ్వుల నూనెతో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సీతారాంబాగ్, దత్తాత్రేయ నవగ్రహ ఆలయ అధ్యక్షుడు బద్రినాథ్ సింగ్, కోశాధికారి గోపాల్ సింగ్ శని మహరాజ్ జయంతి వేడుకల్లో పూజలు నిర్వహించారు. దత్తగిరి ఆధ్యాత్మిక గురువు అవదూత గిరి మహరాజ్, డాక్టర్ సిద్దేశ్వర నందగిరి మహరాజ్ ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. గోపాల్ సింగ్, బద్రినాథ్ సింగ్‌తో పాటు పలువురు మహరాజ్‌ల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఇంద్రపాల్ సింగ్, మనిమిత్ సింగ్, సూరజ్, విశాల్ సింగ్, ఆకాష్ సింగ్, శ్రీరాజ్ సింగ్, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం


మాట్లాడుతున్న ఎన్.బాలచారి

గన్‌ఫౌండ్రీ: సమాజ హితాన్ని కోరేదే సాహిత్యమని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 'కథా కార్యశాల'అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేటితరం రచయితలకు కథలపై అవగాహన కలిగించి కథలు ఎలా రాయాలి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అనంతరం ఎన్.బాలచారి మాట్లాడుతూ..సాహిత్య ప్రక్రియలలో కథ సాహిత్యం బలమైన ముద్ర వేసుకుందని, అలాంటి కథా సాహిత్యాన్ని నేటి తరం రచయితల చెంతకు తీసుకువెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కథా రచయితలు పెద్దింటి అశోక్‌కుమార్, కాలువ మల్లయ్యలు హాజరై యువ రచయితలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

కోట బోనాలకు సహకరిస్తాం

గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల ఏర్పాటుకు అన్ని రకాలుగా సహకరిస్తామని గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి మల్లేశం అన్నారు. కోట బోనాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆయనను కోటలోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ కె.చంటిబాబు ఆయనను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు లోబడి బోనాల నిర్వహణకు అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. అంతేకాకుండా బోనాలు జరిగే రోజుల్లో కోటలో భక్తులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.శ్రీకాంత్, సురేష్‌గౌడ్ తదితరులున్నారు.


మహంకాళి ఆలయంలో పూజలు..

గౌలిపురా: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా, వాసవి అన్నపూర్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా అధ్యక్షులు శ్రీరాం కోటయ్య గుప్తా, ఐపీపీ శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, మాజీ అధ్యక్షులు ఇరుకుల్ల నరసింహులు గుప్తా, ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి పడకంటి వెంకటేశం గుప్తా పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

హనుమాన్‌నగర్ బస్తీ దవాఖానా సమీపంలోని నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.



అలరించిన నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నృత్య దర్పణ, దర్పణ ఎక్స్‌ప్రెషన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ పండితుడు డాక్టర్ అర్ధనారీశ్వరం వెంకట్ జయంతిని పురస్కరించుకొని శ్రీపాద అర్చన పేరిట మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ..అర్ధనారీశ్వరం నృత్య రూపకానికి ప్రతీక అయిన వెంకట్ స్మృతులను కొనసాగించడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు శ్రీ వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల మధ్య ఆధ్యాత్మిక ప్రేమ, భక్తి, మానసిక స్థితిగతుల ద్వారా ప్రేక్షకుల మన్ననలను పొందారు. అన్నమయ్య పాత్రలో రుత్విక్, వెంకట్, అలివేలు మంగ పాత్రలో చర్మిల వెంకట్‌లు చక్కటి హావాభావాలతో నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కథక్ కళాక్షేత్ర డైరెక్టర్ అంజిబాబు, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంజయ్‌కుమార్ జోషి తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి


లాల్‌దర్వాజా మోడ్ వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేశ్


నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: మాజీ దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం అబిడ్స్ చౌరస్తాలోని నెహ్రూ విగ్రహానికి ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, బీసీ కమిషన్ నిరంజన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌రావుతో పాటు పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. దేశ అభ్యున్నతికి, దేశ ప్రగతికి నెహ్రూ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జమిల్, రమణారెడ్డి, కృష్ణకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా మోడ్ వద్ద..

గౌలిపురా: జవహర్ లాల్ నెహ్రూ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని లాల్‌దర్వాజా మోడ్ వద్ద పార్టీ నాయకులతో కలిసి వెంకటేశ్ నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.సురేశ్ బాబు, జి.శ్రీనివాస్, కిషన్ ప్రసాద్ కపూర్ పాల్గొన్నారు.

నెహ్రూ జూ పార్కు వద్ద..



చార్మినార్: జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని నెహ్రూ జూ పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు మంగళవారం నివాళులర్పించారు. నెహ్రూ విగ్రహం వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం చెంది వెంటనే సంబంధిత జూ అధికారులను కలిసి తమ నిరసన తెలిపారు. ప్రతి ఏడాది జూ పార్కు అధికారుల ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహానికి పూల మాలలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారని..ఈసారి పట్టించుకోకపోవడంతో వారిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. తమ వినతి మేరకు ఆఘమేఘాల మీద పూలతో డెకరేషన్ చేయడంతో తాము నివాళులర్పించామన్నారు. బహదూర్‌పురా నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ షా ముజాహిద్ హుస్సేనీ, కన్నయ్యలాల్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కియే రెస్టారెంట్లను బ్యాన్ చేయాలి


బీజేపీ నాయకుల సమావేశంలో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: నగరంలో తుర్కియే పేరుతో ఉన్న రెస్టారెంట్లు, మందీలను వెంటనే నిషేధించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. తుర్కియే దేశానికి చెందిన మందీలు, తుర్కియే రెస్టారెంట్ల నిషేధంపై మంగళవారం దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ ప్రేరేపిత స్థావరాలను భారత్ ధ్వంసం చేసిందని అయితే ఈ క్రమంలో తుర్కియే పాకిస్తాన్‌కు మద్దతుదారుగా ఉంటూ సైనిక సహాయాన్ని సైతం చేసిందన్నారు. శత్రుదేశానికి అండగా నిలుస్తున్న వారు నిర్వహించే ఇటువంటి రెస్టారెంట్లను ప్రభుత్వం వెంటనే బ్యాన్ చేయాలని కానీ యెడల తాము వాటికి వ్యతిరేకంగా ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల సత్యనారాయణ, సతీష్ కురుమ, శ్రీనాథ్, న్యాయవాది వంశీ, రాంగోపాల్, దేవర చంద్రశేఖర్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన హకీంపేట్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన నిరుపేదల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దీనికి తోడుగా నిరుపేదల వైద్యం కోసం సీఎం సహాయ నిధి పథకం నుంచి కూడా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూన్ ఫరాన్, వజీఉజ్జమాసిద్ధిఖీ, అలీముద్దీన్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదానం


అన్నదాన చేస్తున్న బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు

బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో..

సుల్తాన్‌బజార్: బుద్ధ అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం కోఠిలోని నల్లపోచమ్మ ఆలయంలో బజరంగ్ సేన ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చన, హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభు, శ్రీకాంత్, సురేష్, సాయి, బిల్లా, శేఖర్, హరి, అరవింద్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: గోల్కొండ కోటపై ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి బి.సురేష్‌చారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.